AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM

18-9-2026 (Friday)  MAIN EDITION

## 22ఏ సమస్యల పరిష్కారానికి హై లెవల్ కమిటీ




**అక్షరటుడే, హైదరాబాద్ :** 22ఏ సమస్యల పరిష్కారానికి హై లెవల్ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫాస్ట్ ట్రాక్ విధానంలో సమస్యలను ఈ కమిటీ పరిష్కరించనుంది. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఇటీవల అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాలతో కమిటీ ఏర్పాటు ఏర్పాటు అయింది. కమిటీ చైర్మన్‌గా సీసీఎస్‌ఏ కమిషనర్ లోకేష్ కుమార్, సభ్యులుగా లా సెక్రటరీ పాపిరెడ్డి, ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వ్యవహరించనున్నారు.

## కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



**అక్షరటుడే, ఏపీ :** తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన శుక్రవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీమలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి గోవుల గోపన్న అలంకారంలో మాడ వీధుల్లో విహరించారు. కల్పవృక్ష వాహన దర్శనంతో కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. శనివారం గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు. గరుడసేవ సందర్భంగా శనివారం ఉదయం 3 గంటల నుండే భక్తులను స్వామి పుష్కరిణిలోకి అనుమతిస్తామని టీటీడీ తెలిపింది.

## ప్రపంచ వెదురు దినోత్సవం



అక్షరటుడే, హైదరాబాద్: నగరంలోని రవీంద్ర భారతిలో రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మేదరి కులస్తులు రూపొందించిన వివిధ వెదురు వస్తువులను పరిశీలించారు.

## కొత్త పార్టీపై విజయసాయి రెడ్డి కీలక వాఖ్యలు



అక్షరటుడే, ఏపీ : మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి త్వరలోనే కొత్త పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. అనంతపురంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఏపీ రాజకీయాల్లో టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా ఒక బలమైన మూడో వేదిక రావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

## గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా తెలంగాణ



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్, ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం దూసుకెళ్తోంది. కేవలం పెట్టుబడులు, వ్యాపారాలకే కాకుండా భవిష్యత్తును తీర్చిదిద్దే మేధస్సు, నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ‘బీఆర్ఎస్ భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం’



**అక్షరటుడే, కరీంనగర్:** కేంద్ర మంత్రి బండి సంజయ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబం, ఆ పార్టీ నేతల భూకబ్జాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కబ్జాలకు సంబంధించి పక్కా ఆధారాలుంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ భూదోపిడీపై త్వరలోనే ‘దండయాత్ర’ చేస్తామన్నారు. కబ్జా చేసిన ఆ భూముల్లో కాషాయ జెండాలు పాతి, వాటిని పేదలకు పంచుతామని స్పష్టం చేశారు.

## మమతా బెనర్జీ వర్గం పార్టీ పేరు, గుర్తింపు ఖరారు

**అక్షరటుడే, బెంగాల్ :** తృణమూల్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాలకు వేర్వేరు పేర్లు, గుర్తులను ఎన్నికల సంఘం శుక్రవారం కేటాయించింది. ఉప ఎన్నిక కోసం అరూప్ రాయ్ నేతృత్వంలోని వర్గానికి డెమొక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్, పేరు ఎన్వలప్ (కవరు) గుర్తును, మమతా బెనర్జీ వర్గానికి మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరును, ఫుట్‌బాల్ ప్లేయర్ చిహ్నాన్ని ఈసీ ఖరారు చేసింది.

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు మానవ అక్రమ రవాణా కేసుకు సంబంధించి ఒక సంచలన తీర్పును వెలువరించింది. 2019లో వెలుగు చూసిన ఈ కేసులో విచారణ పూర్తిగా ముగిసింది. సేకరించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో, ఏకంగా 9 మంది నిందితులకు జీవిత ఖైదు ఖరారు చేసింది. ఈ కేసులో శిక్ష పడిన వారిలో 8 మంది బంగ్లాదేశీయులు ఉండటం గమనార్హం. - అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి




# ఎన్ఐఏ కోర్టు సంచలన తీర్పు

- మానవ అక్రమ రవాణా కేసులో..
- 9 మందికి జీవిత ఖైదు
- నిందితుల్లో 8 మంది బంగ్లాదేశీయులు

బంగ్లాదేశ్ నుంచి మహిళలను అక్రమంగా భారత్‌కు తరలిస్తున్న ముఠా గుట్టును 2019లో అధికారులు బట్టబయలు చేశారు. నగర పరిధిలోని పహాడీషరీఫ్ ప్రాంతంలో ఈ ఘటన కలకలం రేపింది. అమాయక మహిళలకు మంచి ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి, వారిని అక్రమంగా సరిహద్దులు దాటించి, బలవంతంగా వ్యభిచారంలోకి దించుతున్న ఈ అంతర్జాతీయ రాకెట్‌ను పోలీసులు గుర్తించారు.

### 12 మందిపై ఛార్జిషీట్

ఈ వ్యవహారంపై 2019లో తొలిసారిగా కేసు నమోదైంది. ఆ తర్వాత కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకున్న జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) అధికారులు ఈ కేసును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. లోతుగా దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ అధికారులు A1 నుంచి A12 వరకు మొత్తం 12 మంది నిందితులపై కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు.

### సాక్ష్యాధారాల పరిశీలన

ఈ కేసులో కోర్టులో సుదీర్ఘ వాదనలు ముగిసిన తర్వాత, న్యాయమూర్తి సాక్ష్యాధారాలను సమగ్రంగా పరిశీలించారు. నిందితులపై నేరం స్పష్టంగా రుజువు కావడంతో హైదరాబాద్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు తుది తీర్పును వెల్లడించింది. మొత్తం నిందితుల్లో 9 మందికి జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పును ప్రకటించింది. అంతేగాకుండా రూ.1.37 లక్షల జరిమానా వేసింది. జరిమానా కట్టకపోతే అదనంగా మరో 3 నెలల సాధారణ జైలు శిక్ష అమలు చేయాలని ఆదేశించింది. కాగా ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఆఫర్




**అక్షరటుడే, నాంపల్లి :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డికి ఆఫర్ ఇచ్చారు. తాము రూ.లక్ష కోట్లు కొల్లగొట్టామని చెబుతున్న సీఎం.. తమకు రూ.వెయ్యి కోట్లు ఇస్తే మొత్తం రాసిస్తామన్నారు. ఫార్ములా ఈ కారు రేసు విచారణ కోసం కేటీఆర్ శుక్రవారం ఉదయం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. కోర్టు విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. “ రేవంత్‌కు మంచి ఆఫర్ ఇస్తున్నా.. మాకు వెయ్యి కోట్లు ఇస్తే మొత్తం ఇచ్చేస్తాం.. మిగిలిన 99 వేల కోట్లు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలకోసం ఖర్చు చెయ్యండి” అని కేటీఆర్ అన్నారు. కాళేశ్వరంలో లక్ష కోట్లని ప్రచారం చేసినట్లుగానే ఇప్పుడు విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## కేంద్ర మంత్రిని కలిసిన సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం కలిశారు. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకంలో భాగంగా రాష్ట్రానికి మొదటి విడతలో 2 లక్షల ఇళ్లను కేటాయించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని జులైలో సీఎం కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. ఈ క్రమంలో తాజాగా రెండు లక్షల ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని శివరాజ్ సింగ్ చౌహాన్‌ను సీఎం కోరారు.

## ఢిల్లీలో దారుణం.. బాలికపై గ్యాంగ్‌రేప్



**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీలో దారుణ ఘటన వెలుగు చూసింది. ఓ 17 ఏళ్ల బాలికపై ముగ్గురు మైనర్లతో సహా నలుగురు సామూహిక అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను దారుణంగా హత్య చేసి ఖాళీ స్థలంలో పడేశారు. ఈ నెల 13న వాయువ్య ఢిల్లీలోని కుషక్ రోడ్, స్వరూప్ నగర్ ప్రాంతంలో ఉన్న జైపాల్ రాణా పొలం సమీపంలో కుళ్లిన స్థితిలో బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఖద్దా కాలనీకి చెందిన శివం అలియాస్ సుదామతో పాటు ముగ్గురు మైనర్లు ఈ నేరానికి పాల్పడినట్లు వెల్లడించారు.

## ‘ఎంఐఎం ఎమ్మెల్యేలను చూస్తే అధికారులకు భయం’



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంఐఎం ఎమ్మెల్యేలను చూస్తే అధికారులు భయపడుతారన్నారు. తమకు మాత్రం విలువ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల డ్రా ప్రక్రియలో అధికారులు తమకు విలువ ఇవ్వడం లేదని అన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యేలకు మాత్రం భయపడి అన్ని పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. వారు ఇష్టం వచ్చినట్లు తిడుతారని, అందుకే అధికారులు ఎంఐఎం ఎమ్మెల్యేల పని చేస్తున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు.




## అసైన్డ్ భూములను లాక్కోం: మంత్రి పొంగులేటి

**అక్షరటుడే, హైదరాబాద్ :** అసైన్డ్ భూముల పట్టాలు ఉన్నవారిని ఎలాంటి ఇబ్బంది పెట్టబోమని, ప్రభుత్వ పట్టాలు ఉన్నవారి భూములను లాక్కునే ప్రసక్తి లేదని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం చిట్‌చాట్‌లో ఆయన భూముల సర్వే, కేసీఆర్, హరీష్‌రావుల ఆస్తులపై పలు కీలక విషయాలను వెల్లడించారు. ప్రస్తుతం భూముల ఓవర్ ల్యాపింగ్‌ను వెలికితీసే ప్రక్రియ మాత్రమే జరుగుతోందని మంత్రి తెలిపారు. ఒక వ్యక్తి నివసించే భూమి ఎంత, డాక్యుమెంట్లలో ఉన్నది ఎంత, ఫిజికల్ పొజిషన్‌లో ఎంత ఉందనేది స్పష్టత రావాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూముల లెక్క తేల్చిన తర్వాతే పక్కనున్న భూముల యజమానులకు నోటీసులు ఇస్తామని చెప్పారు.

## అమెరికాలో సిక్కు డ్రైవర్‌పై కత్తితో దాడి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికాలో సిక్కు డ్రైవర్‌పై ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ట్రంప్ బృందం 'మిస్టర్ సింగ్' పోస్ట్‌పై వివాదం కొనసాగుతున్న క్రమంలో.. ఈ దాడి జరగడం గమనార్హం. బాధితుడు మాట్లాడుతూ.. తనపై ఎందుకు దాడి చేశారో అర్థం కావడం లేదన్నారు. సింగ్ పెన్సిల్వేనియాకు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తుండగా ఈ దాడి జరిగింది. ఆయన మార్గ మధ్యలో బాత్రూమ్ ఉపయోగించడానికి ఆగాడు. అతను లోపలికి నడుస్తున్నప్పుడు, వెనక నుంచి వచ్చిన ఓ వ్యక్తి 17 సార్లు కత్తితో దాడి చేశాడు.





## రూ.8 లక్షల లంచం తీసుకుంటూ చిక్కిన జీఎస్టీ అధికారి

**అక్షరటుడే, కర్ణాటక :** బెంగళూరు లోకాయుక్త చేపట్టిన ఒక ఆపరేషన్‌లో సెంట్రల్ జీఎస్‌టీ సూపరింటెండెంట్ రూ. 8 లక్షల లంచం తీసుకుంటూ దొరికాడు. నిందితుడిని సౌత్ కమిషనరేట్ పరిధిలోని సౌత్ డివిజన్4కు చెందిన జీఎస్‌టీ సూపరింటెండెంట్ మోహిత్ ప్రతాప్ సింగ్‌గా గుర్తించారు. పెండింగ్‌లో ఉన్న జీఎస్టీ బకాయిలుపై తప్పుడు ఫిర్యాదును మూసి వేయడానికి ఓ వ్యాపారిని సదరు అధికారి లంచం అడిగాడు. వ్యాపారి ఫిర్యాదు మేరకు లోకాయుక్త అధికారులు వల పన్ని జీఎస్టీ అధికారిని పట్టుకున్నారు.

## కేంద్ర మాజీ మంత్రి కాన్వాయ్‌పై దాడి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేంద్ర మాజీ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ కాన్వాయిపై దాడి జరిగింది. 'నషా ముక్త్ పంజాబ్ యాత్ర'లో పాల్గొనేందుకు పఠాన్ కోట్ వెళ్తుండగా కాన్వాయ్‌పై కొందరు దాడి చేశారు. 'నషా ముక్త్ పంజాబ్ యాత్ర'లో పాల్గొనడానికి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని బిట్టు డిమాండ్ చేశారు. తనను యాత్రలో పాల్గొనకుండా అడ్డుకునేందుకే స్థానిక ఎమ్మెల్యే షెరీ ఆ వ్యక్తులను పంపారని ఆరోపించారు.

